క్లుప్తంగా

అర్హులందరికీ బీసీబంధు

వట్‌పల్లి(అందోల్): అర్హులందరికీ బీసీబంధు అందిస్తామని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామంలో పలువురికి బీసీ బంధు చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులు బీసీ బంధును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

నారాయణఖేడ్: నెల రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు, నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండలంలోని పిప్రి గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రామం మీదుగా వెళ్లే 161బీ జాతీయ రహదారిపై ఖాళీబిందెలతో రాస్తారోకో నిర్వహించారు. మిషన్ భగీరథ పథకం నీటిసరఫరా నిలిచిపోవడంతో నెలరోజులుగా గ్రామ శివారులోని వ్యవసాయ బావులు, బోర్ల నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గంటసేపు రాస్తారోకో చేయడంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

హత్నూర (సంగారెడ్డి): సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి హేమలత అన్నారు. బుధవారం తహర్బాన్ పేట గ్రామానికి ప్రభుత్వం మంజూరు చేసిన 12 యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేస్తోందన్నారు. గొర్రెల కాపరులు ఈ పథకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

యువజన కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

నారాయణఖేడ్: యూత్‌జోడో.. బూత్ జోడో కార్యక్రమంలో భాగంగా మండలంలోని చాప్టా(కె) గ్రామంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమలుచేసిన సంక్షేమ పథకాలతోపాటు, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు జహంగీర్, భానుగౌడ్, గైని శ్రీకాంత్, వార్డు సభ్యుడు దత్తు, మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్

పటాన్‌చెరు టౌన్: క్రాస్టాక్ ప్రేరిత ప్రభావాలు, ఆన్‌చిప్ వీఎల్‌ఎస్ఐ ఇంటర్ కనెక్ట్‌ల పనితీరు విశ్లేషణ అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్ డాక్టరేట్ సాధించారు. వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఈ పరిశోధనను పర్యవేక్షించినట్టు బుధవారం తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొ.సీతారామయ్య, ఈఈసీఈ విభాగాధిపతి డాక్టర్ మాధవి అభినందించారు.

రుణమాఫీ వెంటనే చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): రైతుల రుణమాఫీ వెంటనే చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోగల వ్యవసాయ శాఖ జేడీఏ నర్సింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూములకు బ్యాంకు రుణాలు ఇవ్వని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రైతు రుణమాఫీ అందరికీ వర్తింప చేయాలన్నారు. అలాగే కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు రాజయ్య, కృష్ణ, మాణిక్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గాజుల్‌పాడ్‌ను కంగ్టి మండలంలోనే కొనసాగించాలి

నారాయణఖేడ్: కంగ్టి మండలంలోనే తమ గ్రామాన్ని కొనసాగించాలని గాజుల్‌పాడ్ గ్రామస్తులు కోరారు. ఖేడ్ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన తడ్కల్ మండలంలో కలపొద్దని తీర్మానించారు. బుధవారం ఆర్డీఓ వెంకటేశ్‌కు తీర్మాన ప్రతిని, వినతపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కంగ్టి మండల కేంద్రానికి గ్రామం అతి దగ్గరలో ఉందని, కొత్తమండల కేంద్రంగా ప్రకటించిన తడ్కల్ చాలాదూరంలో ఉందన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం కొన్ని చోట్ల ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. వారితో ర్యాలీ తీశారు. చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.



ఝరాసంగం(జహీరాబాద్): గోపిక వేషధారణలో చిన్నారి



న్యాల్‌కల్(జహీరాబాద్): హద్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నవభారత్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



జిన్నారంలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నచిన్నారులు





మునిపల్లి(అందోల్): తాటిపల్లి యునైటెడ్ పాఠశాల ఆవరణలో ఉట్టి కొడుతున్న బాలిక, బాలుడు



జహీరాబాద్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

నవ సమాజ నిర్మాతలు గురువులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో బుధవారం గురుపూజోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గస్థాయి ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువు లేని విద్య గుడ్డి విద్య అని, గురువు లేకుండా ఏ విద్యార్థి రాణించలేడన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ రాఘవేంద్ర రెడ్డి, మండల విద్యాధికారి పీపీ రాథోడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ప్రైవేటు పాఠశాలల సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యకు ప్రాధాన్యత

సంగారెడ్డి టౌన్ : సీఎం కేసీఆర్ పాలనలో విద్యారంగం దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో గురుపూజోత్సవం సందర్భంగా పురస్కారాలు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను జెడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డితో కలిసి సన్మానించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధి తెలంగాణ మోడల్ స్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారారు. 6 నుంచి 10వ తరగతి వరకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శైలజ బహుమతులు అందజేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ అంజిరెడ్డి, ఎస్ఆర్ ట్రస్ట్ అధ్యక్షురాలు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యురాలు గోదావరి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గ్రాండ్ సీతార హోటల్‌లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదన్నారు. గురువులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

చక్కెర కర్మాగార పరిరక్షణకు సర్వమత ప్రార్థనలు



సర్వమత ప్రార్థనల్లో మాట్లాడుతున్న ఢిల్లీ వసంత్ తదితరులు

జహీరాబాద్ టౌన్: ట్రైడెంట్ చక్కెర కర్మాగారం పరిరక్షణకు సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ చేపట్టిన మట్టి మనుషుల మనోగతం–భూమి పుత్రుల ఆకలి కేక సామూహిక ప్రార్థన బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఢిల్లీ వసంత్ మాట్లాడారు. చక్కెర ఫాక్టరీ యాజమాన్యం ఫాక్టరీని అమ్మడానికి ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న దళిత బంధు కింద నియోజకవర్గానికి 1100 యూనిట్లు మంజూరయ్యాయని, ఈ పథకంలో వచ్చే రూ.10 లక్షల సహాయంతో చక్కెర కర్మాగారాన్ని కొనుగోలుచేసి నడుపుకుంటామన్నారు. ఇందుకు ప్రభుత్వం సహకరించాలన్నారు. కార్యక్రమాన్ని విజయంతం చేసిన రైతులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పొంగుతున్న వాగులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జిన్నారంలోని రాయిన్‌చెరువు అలుగు పారుతోంది. దీంతో జిన్నారం– జంగంపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే గుమ్మడిదల గ్రామంలోని ఎర్రచెరువు నిండి అలుగు పారుతోంది. మంబాపూర్ చెరువు మత్తడి పొంగి పొర్లుతుంది. కొడకంచి, జిన్నారం, సోలక్‌పల్లి, ఊట్ల, వావిలాల తదితర గ్రామాల్లోని చెరువులు నిండుకుండలా మారాయి.



మంబాపూర్‌లో అలుగు పారుతున్న దృశ్యం

విద్యాశాఖ ఆదేశాలు బేఖాతర్

- బుధవారం సెలవులేదన్న అధికారులు
- హాజరుకాని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యాశాఖ ఆదేశాలను బేఖాతరు చేస్తూ బుధవారం విధులకు గైర్హాజరయ్యారు. మంగళవారం లోకల్ హాలిడేగా అన్ని పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించారు. గురువారం సెలవుపై ఎటువంటి ప్రకటన చేయలేదు. బుధవారం ఉదయం 8 గంటలకు పాఠశాలలకు సెలవులేదని, ఉపాధ్యాయులు విధులకు హాజరై పాఠశాలలను తెరవాలని సమాచారం ఇచ్చారు. దీంతో అన్ని పాఠశాలలు కొంత ఆలస్యమైనప్పటికీ తెరుచుకున్నాయి. మోడల్ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు చేరుకోగా ఉపాధ్యాయులు కనిపించకపోవడంతో ఇంటికి వెళ్లగా, మరికొందరు అక్కడే ఉన్నారు. తొమ్మిది మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో ఒక టీచర్, ముగ్గురు గెస్ట్ టీచర్లు హాజరయ్యారు. ప్రిన్సిపాల్‌తో ఆరుగురు టీచర్లు హాజరు రాలేదు. ప్రిన్సిపాల్ మల్లికను వివరణ కోరగా తనతో పాటు ఆరుగురు ఉపాధ్యాయులు దూర ప్రాంతంలో ఉండటంతో సెలవు తీసుకున్నామన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు వివరణ కోరగా బుధవారం సెలవులేదని చెప్పామన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల గైర్హాజరుపై విచారణ చేపడతామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అన్నదాన కార్యక్రమానికి విరాళం**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోగల సూర్యభగవానుడి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ.50 వేల విరాళం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ **పాదయాత్ర నిర్వహించాలి**

నారాయణఖేడ్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈనెల 7వ తేదీన గురువారం కిలోమీటరు మేర పాదయాత్రలు నిర్వహించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్, డాక్టర్ సంజీవరెడ్డిలు కోరారు. ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని భారత్ జోడో యాత్ర సందేశాన్ని ప్రజలకు తెలిపి విజయవంతం చేయాలని కోరారు.

◆ **ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలి**

జహీరాబాద్ టౌన్: ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మెల్యే మాణిక్‌రావుకు బుధవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి మాట్లాడారు. వర్గీకరణపై బీజేపీ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, చివరి పార్లమెంట్ సమావేశంలో ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అబ్రహం మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

◆ **గుంతల రోడ్డుపై నాట్లువేసి నిరసన**

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రమైన వట్‌పల్లిలో అల్లాదుర్గం నుంచి మెట్‌కుంట వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారాయి. దీంతో గురువారం కాంగ్రెస్ నాయకులు నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ జోషి రోడ్డుకు నిర్మాణానికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మైనార్టీలు సహకరించాలి**

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ విజయానికి బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని మాజీ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అక్బర్ హుస్సేన్ కోరారు. బుధవారం పట్టణంలోని ఐబి అతిథి గృహంలో బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడారు. చింతా ప్రభాకర్ విజయానికి సహకరిస్తామని మైనార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకాభిప్రాయంతో తీర్మానించడం జరిగిందన్నారు.

◆ **ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

జహీరాబాద్ టౌన్: శ్రావణ మాసం కావడంతో పట్టణంలోని ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. పట్టణంలోని శ్రీమాణిక్‌ప్రభు మందిరంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాణిక్‌ప్రభు, రేణుకా ఎల్లమ్మ, బసవేశ్వర మహిళా మండలి, మార్కండేయ మహిళా మండలి భజన బృందాలు నిత్యం భజనలు చేస్తున్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలికలు, బాలుర గురుకులల్లో జూనియర్ లెక్చరర్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా డీఎమ్‌డబ్ల్యూఓ దేవుజా, ఆర్ఎల్సీ డి. నర్సింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బయోసైన్స్ , ఫిజికల్ సైన్స్ , గణితం, ఇంగ్లిష్, జనరల్ సైన్స్, సాంఘిక శాస్త్రం, ఫిజిక్స్, వృక్షశాస్త్రం, బయోలజీ సబ్జెక్ట్‌లను బోధించాల్సి ఉంటుందని తెలిపారు. డిప్యూటీ వార్డెన్, ప్లంబర్ అండ్ ఎలక్ట్రిషన్, స్టాఫ్ నర్స్ పోస్టులకు కూడా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. వీటిని ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంగారెడ్డి ఆర్ఎల్సీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి

- సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున్ పాటిల్

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణపై అధికారులు విధిగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇచ్చి సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున్ పాటిల్ అన్నారు. రాయికోడ్‌లోని ఐకేపీ భవనంలో ఎంపీపీ మమత అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజలు జ్వరాలబారిన పడకుండా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యురాలు నిఖిలను ఆదేశించారు. ఆశావర్కర్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీటీసీ నీరంజన్ కోరారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ రాయికోడ్ నుంచి హైదరాబాద్ రూట్లలో రెండు బస్సు సర్వీసులు రెగ్యులర్‌గా నడపాలని కోరారు. ఇటికేపల్లి, పాంపాడ్ రూట్లలోను బస్సు సౌకర్యం కోసం ఆర్టీసీ చర్యలు చేపట్టాలని కోరారు. జహీరాబాద్–పీపడ్‌పల్లి రూటులో బస్సు చివరి ట్రిప్‌ను నైట్‌హాల్ట్ గా ఉంచాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా నాటే మొక్కలు నిర్ణీత దూరంలో నాటేలా ట్రాన్స్‌కో, ఆర్అండ్‌బీ, ఈజీఎస్ అధికారులను సమన్వయం చేయాలని సర్పంచ్‌లు, కేదారినాథ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి ఎంపీడీఓ వెంకటేశంకు సూచించారు. సమావేశంలో సర్పంచ్‌లు కేదారినాథ్ పాటిల్, నరేశ్, నర్సమ్మ, సంతోష్‌పాటిల్, ప్రవీణ్‌కుమార్, హన్మంతు, మైపాల్‌రెడ్డి, నాగార్జున, శంకర్, తుల్జమ్మ, అమృత, కోఆప్షన్ మెంబర్ అబేద్‌మియా, ఎంపీటీసీలు మొగులప్ప, పండరి, వీణారాణి, నవనీత, ఆయా శాఖల అధికారులు హర్షవర్ధన్‌రెడ్డి, అభినాష్ వర్మ, ముఖీద్, నర్సింహులు, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, రాంకిషన్, ప్రసాద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటరు నమోదు వేగవంతం చేయాలి

సంగారెడ్డి టౌన్: కొత్త ఓటరు నమోదు ప్రక్రియని వేగవంతం చేయాలని సంగారెడ్డి మండల ఎంపీడీఓ రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో 18 ఏళ్లు దాటిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రచారం ప్రారంభించారు. ఈనెల 19వ తేదీవరకు అవకాశం ఉందన్నారు.

యువ ఓటర్లను చేర్పండి

పటాన్‌చెరు టౌన్: యువతను ఓటర్లుగా చేర్పేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి దేవుజ అన్నారు. పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో ఓటరు జాబితా ప్రక్షాళనపై బుధవారం సమావేశం నిర్వహించారు. యువతను ఓటర్లుగా చేర్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 19 తేదీ వరకు కొత్త ఓటరు నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, బీజేపీ జిల్లా కార్యదర్శి కుమార్, కాంగ్రెస్ జెడ్పీటీసీ ఇన్‌చార్జి రాధాకృష్ణ పంతులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఖేడ్ ఆర్డీఓ వెంకటేశ్, తహసీల్దార్ దేవిదాస్ సూచించారు. మండలంలోని పంచగామ, వెంకటాపూర్ గ్రామాల్లో బుధవారం ఓటరు నమోదుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఓటర్లుగా నమోదు చేసుకునేలా స్వయం సహాయక సంఘాల మహిళలు కృషిచేయాలని అన్నారు.

బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతోంది

- ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



ఆహ్వానపత్రిక అందజేస్తున్న తేజ గురుస్వామి

నారాయణఖేడ్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని బుధవారం ఎమ్మెల్యే అన్నారు. మనూరు మండలం శెల్గిరకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు.

ఆహ్వాన పత్రిక అందజేత

కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పోతిరెడ్డిపల్లి తండాలో ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న వీరాంజనేయస్వామి ఆలయ 10వ వార్షికోత్సవానికి ఆహ్వానిస్తూ ఆలయ పీఠాధిపతి తేజ గురుస్వామి ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేశారు.

రెచ్చగొట్టడం కాంగ్రెస్ నైజం

ప్రజలను రెచ్చగొట్టడం కాంగ్రెస్ నైజమని ఎమ్మెల్యే విమర్శించారు. తడ్కల్ మండలంలో కాకుండా కంగ్టి మండలంలో ఉంచాలని గాజుల్‌పాడ్ గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. కాగా గాజుల్‌పాడ్, సుక్కల్‌తీర్థ్‌తోపాటు మిగతా గ్రామాలను కలిపి తడ్కల్ కేంద్రంగా కొత్తమండలంగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరగా ఎమ్మెల్సీగా ఉన్నపుడు రాములునాయక్ సీఎంకు వినతిపత్రం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఆయా గ్రామాలను తడ్కల్ మండలంలో చేర్చవద్దంటూ ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, బీజేపీ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై సంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

హోటల్ యజమానికి రూ.10వేల జరిమానా

జహీరాబాద్: పట్టణంలోని ఆనంద్ భవన్ హోటల్ యజమానికి మున్సిపల్ అధికారులు రూ.10వేలు జరిమానా విధించారు. బుధవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై శానిటేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా హోటల్ ముందు చెత్త పేరుకుపోవడం, వర్షం నీరు నిల్వ ఉండటాన్ని గుర్తించి జరిమానా విధించారు. చెత్తను విధిగా డ్రమ్ముల్లో వేయాలని సూచించారు. అనంతరం ఐడీఎస్ఎంటీ ప్లాట్ల లే అవుట్‌నూ పరిశీలించారు.

మౌలిక వసతులు కల్పించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించామన్నారు. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ విద్య

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షోభంలోకి తీసుకెళ్లిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. 24 వేల టీచర్ పోస్టులకు కేవలం 5,609లకే డీఎస్సీ ప్రకటించి, ఖాళీలపై గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. కేంద్రం తీసుకొస్తున్న నూతన విద్యా విధానంపై అసెంబ్లీలో తీర్మానం చేయకుండా పరోక్షంగా మద్దతు తెలియజేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 8, 9, 10 తేదీలలో సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జరుగుతున్నాయన్నారు.

11 నుంచి అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె

కొండాపూర్(సంగారెడ్డి): అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ని పర్మినెంట్ చేయాలని ఈ నెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పేర్కొన్నారు. బుధవారం జిల్లా మహిళా సంక్షేమ అధికారి సంధ్యారాణికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి మంగ మాట్లాడుతూ 40 సంవత్సరాలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేస్తున్న టీచర్స్, హెల్పర్స్‌పై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

జహీరాబాద్ టౌన్: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ) నాయకుడు మహిపాల్ తెలిపారు. గురువారం అధికారులకు బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సబితా, వసీమా తదితరులు ఉన్నారు.